సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 26 । నవంబర్ । 2023



క్రికెట్ మ్యాచ్‌లు షురూ
ఏసీఏ అండర్–23 అంతర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు శనివారం కడపలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాల్లో ప్రారంభమయ్యాయి. -8లో



పరిమితికి మించి తరలించొద్దు
ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.270	రూ.360
రెండోరకం	రూ.160	రూ.268

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 322 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	430	430
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 110.00 కిలోలు

పెద్ద ఉరుసు ప్రారంభం

- ఆధ్యాత్మిక శిఖరంగా వెలుగొందుతున్న అమీన్‌పీర్ దర్గా
- నేటి నుంచి ఉరుసు ఉత్సవాల నిర్వహణ
- ప్రభుత్వం తరుపున చాదర్ సమర్పించనున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



విద్యుద్దీపాల వెలుగులో దర్గా ప్రాంగణం

కడప కల్చరల్: దేశంలో ఎన్నో ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్నాయి. వాటిలో ఇస్లాం సూఫీ తత్వాన్ని బోధిస్తూ కులమతాలకు అతీతంగా ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంచుతూ మానవత్వానికే పెద్దపీట వేస్తున్న కడప అమీన్‌పీర్ దర్గాకు విశిష్టమైన పేరుంది. దీనిని దక్షిణ భారత అజ్మీర్‌గా కూడా కొనియాడుతారు. సామాన్య మానవుడి నుంచి అత్యున్నత స్థాయి రాజకీయ, సినీ ప్రముఖులు ఒకేస్థాయిలో స్వేచ్ఛగా ప్రార్థనలు చేసుకోగలిగిన వాతావరణంగల ఈ క్షేత్రం నిరంతరం భక్తులతో కళకళలాడుతూ ఉంటుంది. శాంతియుత సూఫీ తత్వాన్ని ప్రబోధిస్తున్న ఈ దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు ఈనెల 26, 27, 28 తేదీల్లో నిర్వహిస్తారు. మరో పది రోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయి.

గురువుల చరిత్ర

16వ శతాబ్దంలో కర్ణాటకలోని బీదర్ ప్రాంతం నుంచి మహా ప్రవక్త (సా.అ.వ) వంశీయులైన ఖ్వాజాయే ఖాజుగా నాయబె రసూల్ అతాయే రసూలుల్లాహ్ హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా పీరుల్లామాలిక్ సాహెబ్ తన సతీమణి కుమారుడు హజరత్ ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్, హజరత్ అహ్మద్ హుసేనీ సాహెబ్‌లతో పాటు భక్తగణంతో ఈ ప్రాంతానికి వచ్చారు. ఆధ్యాత్మిక బోధనలతో అందరినీ ఆకట్టుకున్నారు. నాటి నవాబులు వీరి మహిమలను గమనించిప్రియ భక్తులు అయ్యారు. వారి కోరిక మేరకు గురువులు కడప నగరంలో స్థిరపడ్డారు.

మహాతపస్వి

దర్గా వ్యవస్థాపకులు హజరత్ సయ్యద్‌షా పీరుల్లా మాలిక్ అయినా పెద్ద ఉరుసు మాత్రం సూఫీ సర్ మస్తాని ఆరీఫుల్లా మహమమ్మద్ మహ్మదుల్ హుసేనీ సాహెబ్ పేరిటే జరుగుతుంది. ఆయన 40 సంవత్సరాలపాటు తాడిపత్రి అటవీ గుహల్లో, 23 సంవత్సరాలపాటు కడప శేషాచల అడవుల్లో తపస్సు చేశారు. దానికి ప్రతీకగా దర్గాలో ఆయన మజార్ మిగతా వాటి కంటే కాస్త ఎక్కువ ఏర్పాటు చేశారు. భక్తులు తొలుత హజరత్ పీరుల్లా మాలిక్ మజార్‌ను దర్శించుకున్న తర్వాతే హజరత్ ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్, అమీనుల్లా హుసేనీ సాహెబ్‌మజార్లను కూడా దర్శించుకుంటారు. హజరత్ అమీనుల్లా హుసేనీ సాహెబ్ 10వ పీఠాధిపతిగా వ్యవహరించారు. ఆధ్యాత్మికంగానే కాకుండా ప్రేమ, దయ, మానవతా గుణం ఎక్కువగా ఉండడంతో ఆయనను అభిమానించేవారు ఎక్కువయ్యారు. పలువురు భక్తులు ఆయన పేరుతోనే దర్గాను అమీన్‌పీర్ సాహెబ్ దర్గాగా పేర్కొనేవారు. కాలక్రమంలో అది అమీన్‌పీర్ దర్గాగా మారింది.

11వ పీఠాధిపతి



ప్రస్తుతం దర్గా 11వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ నిర్వహణలో ఉంది. దర్గాలో మొత్తం గురువులు, వారి వారసుల పేరిట ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం ఏటా మొత్తం 11 చిన్న ఉరుసులు, గంధం ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రస్తుతం పెద్ద ఉరుసును వారం రోజులపాటు అత్యంత వైభవంగా జరుగుతుంది. దేశం నలుమూలల నుంచి లక్షలాది భక్తులు హాజరవుతారు. ఉరుసు ముగిశాక పదిరోజుల వరకు సందడి కొనసాగుతుంది.

సర్వమత సమానత

ఈసారి ఉరుసును విలక్షణమైన రీతిలో నిర్వహించనున్నారు. పీఠాధిపతి ఆదేశం మేరకు దర్గా సమీపంలోని దాదాపు 10 హిందూ దేవాలయాలు, మూడు చర్చిలు, మరికొన్ని మసీదులు, హిందూ, ముస్లిం శ్మశాన వాటికలను కూడా సుందరీకరించి ఉత్సవ వాతావరణం ఉట్టిపడేలా అలంకరిస్తున్నారు. ముస్లిం గురువు పేరిట ఉత్సవాలు జరుగుతున్నా అన్ని మతాల వారు ఆనందంగా గడపాలన్నదే పీఠాధిపతి ఉద్దేశం. ఉరుసు రోజున ప్రభుత్వం పక్షాన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ఇతర అధికారులతో కలిసి చాదర్‌ను తీసుకొచ్చి సమర్పించనున్నారు.

ఉరుసు వివరాలు

హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ చిష్టివుల్ ఖాద్రి సాహెబ్ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26న గంధం, 27న ఉరుసు ఉత్సవం, 28 తహలీల్ ఫాతెహా, అఖిల భారత కవి సమ్మేళనం, 29న ఖవ్వాలీ కచేరీ నిర్వహిస్తారు. 30న అశేష భక్తుల సమక్షంలో నిర్వహించే పీఠాధిపతి ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

బెలూన్ ఆవిష్కరణ

కడప కల్చరల్: ఈ ఏడాది జరగనున్న పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, జిల్లా అధికారులు దీనికి ఎంతో సహకరిస్తున్నారని, జయప్రదం చేసే బాధ్యత అందరిపై ఉందని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. శనివారం దర్గా ప్రాంగణంలో ఆయన ఉరుసు ప్రారంభ సూచనగా బెలూన్‌ను ఎగుర వేశారు. అనంతరం మాట్లాడుతూ అమీన్ పీర్ దర్గా ఉరుసును జిల్లాలో ఘనంగా నిర్వహించడం జరుగుతోందని, దీనిని జిల్లా పండుగగా భావిస్తున్నామన్నారు. ఉత్సవాలలో చిన్నారులు కూడా పాల్గొనేలా పాఠశాలలకు సెలవు ఇవ్వనున్నట్లు తెలిపారు.ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంధం, సోమవారం ఉరుసు ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం తరపున చాదర్ ను కూడా సమర్పించనున్నట్లు, ఇందులో జిల్లా అధికారులు కూడా పాల్గొంటారని తెలిపారు. ఈనెల 30న నగరంలో పీఠాధిపతి ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్‌ఏ కరీముల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు అఫ్జల్ ఖాన్, కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, అక్బర్, చాక్లెట్ గౌస్, దర్గా మేనేజర్ మహమ్మద్ అలీఖాన్, కుతుబుద్దీన్, ముజావర్ అమీర్‌బాషా, దర్గా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బెలూన్‌ను ఎగుర వేస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

న్యూస్‌రీల్

12న జెడ్పీ సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం డిసెంబరు 12వ తేదీ ఉదయం 10 గంటలకు కడపలో నిర్వహిస్తున్నామని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, రెండు జిల్లాల అధికారులు హాజరు కావాలని కోరారు. జిల్లాలో ఆయా శాఖల్లో జరుగుతున్న ప్రగతిపై నివేదికలతో అధికారులు రావాలని సూచించారు.

27న కౌన్సెలింగ్

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో ఈ నెల 27వ తేదీన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామక కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. జోన్–4 (రాయలసీమ జిల్లాలు)లో మొత్తం 95 స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (ఐటీఐ సర్కిల్‌కు సమీపంలో) కార్యాలయం మీటింగ్ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి జరిగే కౌన్సెలింగ్‌కు స్టాఫ్ నర్స్‌గా ఎంపికైన అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

రాయచోటి అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 26 మండలాలు,3 మున్సిపాలిటీల పరిధిలో 124 వలంటీర్‌పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పోస్టుల భర్తీకి ఈనెల 27వ తేదిన నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. 28వ నుంచి డిసెంబర్ 7వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. 8,9, తేదీల్లో దరఖాస్తుల పరిశీలన, 10,11 తేదీల్లో అర్హులకు ఇంటర్వ్యూలు జరగుతాయన్నారు.అర్హులైన వారు ఏపీ వలంటీర్ వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు, రేపు చిత్రకళా ప్రదర్శన

రాజంపేట టౌన్: రాజంపేటలోని జీఎంసీ కళ్యాణ మండపంలో ఆది, సోమవారాల్లో రాజంపేట పట్టణం బోయపాళెంకు చెందిన నాయని గిరిధర్ వేసిన చిత్రాలను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రామకృష్ణారెడ్డి, డీఎస్పీ చైతన్యలతో కలిసి చిత్ర కళాప్రదర్శనను ప్రారంభిస్తారు. ఇందులో వివిధ రకాల పెయింటింగ్ చిత్రాలను ప్రదర్శించనున్నారు.

ఎస్‌ఐల బదిలీ

రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలో ఐదుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఈ ఉత్తర్వులు అమలులోకి వచ్చాయి. రాయచోటి ట్రాఫిక్ ఎస్‌ఐగా పనిచేస్తున్న మహమ్మద్‌రఫీ మదనపల్లె వన్ టౌన్ ఎస్‌ఐగా, రాయచోటి అర్బన్ పీఎస్‌లో రిజర్వుడ్ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఇనాయతుల్లా మదనపల్లి వన్ టౌన్‌కు, నంద్యాల జిల్లా జూపాడు బంగ్లాలో పనిచేస్తున్న ఎస్‌ఐ సి.వెంకటసుబ్బయ్యను మదనపల్లె టూటౌన్ స్టేషన్‌కు, చిత్తూరు జిల్లా చౌడేపల్లి ఎస్‌ఐగా పనిచేస్తున్న రవికుమార్‌ను మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌కు, మదనపల్లి తాలూకా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న పి.వెంకటేశును రాయచోటి ట్రాఫిక్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



దిలీప్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు (రాజంపేట): టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దిలీప్ కుమార్ జాతీయస్థాయి రగ్బీ గేమ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు పేర్కొన్నారు. దిలీప్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ నవంబర్ 18, 19, 20వ తేదీల్లో కర్నూలు జిల్లాలో జరిగిన పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. డిసెంబర్ 22వ తేదీ నుండి 27 వరకు ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో దిలీప్ కుమార్ పాల్గొంటాడని చెప్పారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై
ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 11వ తేదీన తిరుపతిలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: విద్యార్థులకు గ్రూప్–1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో..గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత :

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్1, 2 పరీక్షలపై అవగాహన కల్పించడం తోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం

అవగాహన సదస్సు తేదీ
డిసెంబర్ 11, 2023 (సోమవారం)

వేదిక
మహతి ఆడిటోరియం, బాలాజీ కాలనీ, టౌన్ క్లబ్ సమీపాన, తిరుపతి

సమయం
ఉదయం 09:30 నుంచి 12:30 వరకు.

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 89776 25795

యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లాలో యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి జిల్లా కలెక్టర్ , ఓటరు జాబితా సవరణపై ఆర్డీఓలు, తహసీల్దార్‌లు, బీఎల్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 18 నుంచి 19 సంవత్సరాలు వయస్సు ఉన్న యువత కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జంక్ క్యారెక్టర్స్, 10కిపైన ఎలక్టోరల్స్ ఉన్నవాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. రాజకీయ పార్టీల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ విధి విధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికబద్ధంగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ అధికారులు ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని సీరియస్‌గా తీసుకొని పనిచేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఓటు పరిశీలన పేరుతో వ్యక్తిగత సమాచార సేకరణ

టీడీపీ నాయకుల దౌర్జన్యాలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు

రాయచోటి: ఓట్ల పరిశీలన పేరుతో టీడీపీ కార్యకర్తలు ప్రజల ఇళ్లకు వెళ్లి వారి వ్యక్తిగత సమాచారాన్ని దౌర్జన్యంగా సేకరిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం జిల్లా కలెక్టర్‌ను ఎమ్మెల్యే కలిసి విన్నవించారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని టీడీపీ యాప్‌లో నమోదు చేసుకున్నారని, ఇందులో భాగంగా వారి ఫోన్ నంబర్లు తీసుకొని వాటిలో ఈ యాప్ జనరేట్ అయ్యే ఓటీపీని అడుగుతున్నారన్నారు. ఓటీపీ ఇవ్వకపోతే వారిపై బలవంతం చేయడం, అవసరమైతే టీడీపీ కార్యకర్తలు వారిపై దౌర్జన్యానికి తెగ పడుతున్నారని అన్నారు. ఈ విషయంపై టీడీపీ కార్యకర్తలకు ప్రజలకు మధ్య ఘర్షణ చోటు చేసుకుకుంటుందన్నారు. టీడీపీ నాయకులు ఇప్పటికే 20 శాతం మేర ఇలాంటి సర్వే నిర్వహించి ఓటరు వివరాలను సేకరించారని తెలిపారు. 2024 జూన్‌లో తమ ప్రభుత్వం ఏర్పడుతుందని ప్రజలను నమ్మించి మోసగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజల నుంచి సేకరించిన వ్యక్తిగత సమాచారాన్ని, వారి ఫోన్ నంబర్లను దేశం వెలుపల సర్వర్లలో నిల్వ చేయడం జరుగుతుందని, ఇలా ఓటరు ఐడీ, మొబైల్ నెంబర్లు ఇతర సమాచారంతో పౌరుల డేటాకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు ఉదాహరణగా అన్నమయ్య జిల్లా, రాజంపేట నియోజకవర్గంలోని ఓ మహిళా టీడీపీ కార్యకర్త ఇంటిలోకి వెళ్లి వారి వ్యక్తిగత వివరాలు సేకరించి మొబైల్ ఓటీపీ తీసుకున్నారని, వారు అభ్యంతరం చెప్పడంతో టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారన్నారు. ఇలాంటి సంఘటనలు శాంతి భద్రతల సమస్యగా మారుతున్నాయన్నారు. ఈ సంఘటనలపై పోలీసులు జోక్యం చేసుకొని సాధారణ స్థితికి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీసులు జరిపిన విచారణలో బాబు భరోసా, భవిష్యత్తులో హామీ కార్యక్రమం కింద టీడీపీ కార్యకర్తలు పౌరుల పూర్తి వివరాలనుసేకరిస్తున్నట్లు తెలిసిందన్నారు. ప్రజల ఫోన్ నంబర్లను యాప్‌లకు లింక్ చేసి వ్యక్తిగత వివరాలు టీడీపీ వారి వద్ద నిక్షిప్తమై ఉన్నాయని స్పష్టమైందన్నారు. ఎన్నికల ప్రక్రియ సమగ్రతను నిర్ధారించడానికి ఈ సమస్యను పరిష్కరించి ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని టీడీపీ నాయకులు హరించకుండా కాపాడాలని ఎమ్మెల్యే కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరారు.

దివ్యాంగుల సాధికారత కోసం కృషి



దివ్యాంగులకు ఉప కరణాలు అందజేస్తున్న కేంద్ర మంత్రి నారాయణస్వామి

కడప సెవెన్‌రోడ్స్: సామాన్య జనంలో దివ్యాంగులు కూడా ఒక భాగమే అని భారత ప్రభుత్వ గుర్తించిందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖ మంత్రి ఎ.నారాయణస్వామి అన్నారు.వారి అభివృద్ధి, పునరావాససేవలతో పాటు సాధికారత కోసం పాటుపడుతోందని అన్నారు. శనివారం సామాజిక్ అధికారిత షివిర్ కార్యక్రమంలో భాగంగా ఏడీఐపీ ప్రత్యేక పథకం ద్వారా అలింకో సంస్థ సౌజన్యంతో ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మా ట్లాడుతూ దేశంలో పోషకాహారలోపం, నిమోనియా తదితర కారణాల వల్ల బరువు తక్కువ పిల్లలు, ది వ్యాంగులు జన్మిస్తున్నారన్నారు. వీటిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు.

నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా వరం



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి: రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న జాబ్‌మేళా నిరుద్యోగ యువతీ యువకులకు వరం లాంటిదని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ డిసెంబర్ 2వ తేదీ ఉదయం 9 గంటలకు మెగా జాబ్‌మేళా జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 100పై చిలుకు వివిధ బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాకు దాదాపు 10 వేల మందికి పైగా నిరుద్యోగ యువత హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

- వీక్షిత్ భారత్ యాత్ర కార్యక్రమం విజయవంతం, జగనన్న పాలవెల్లువ కార్యక్రమాల విస్తరణపై జిల్లాలో చేపడుతున్న చర్యలు గురించి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డికి వివరించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర, రీ సర్వే, క్లస్టర్ల అభివృద్ధి కార్యక్రమం, జగనన్న పాల వెల్లువ తదితర అంశాలపై వీసీ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ వీక్షిత్‌భారత్ యాత్రను విజయవంతంగా నిర్వహించాలని, జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని జిలాలోని రైతులందరికీ విస్తరింప చేయాలన్నారు.

క్లుప్తంగా

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన రాజేశ్వరి

ఓబులవారిపల్లె : మండలంలోని గాదెల వెంకటాపురం గ్రామంలో శుక్రవారం ఉరివేసుకొని రాజేశ్వరి (22) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు రాజేశ్వరికి ఆరునెలల క్రితం సుదర్శన్ అనే వ్యక్తితో వివాహమైంది. కొన్ని వివాదాల కారణంగా ఇటీవల వారిద్దరూ విడాకులు తీసుకున్నారు. దీంతో ఆమె పుట్టినిల్లు గాదెల వెంకటాపురంలో ఒంటరిగా ఉంటోంది. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

కీచకోపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

మదనపల్లె : పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించి, వేధింపులకు పాల్పడిన ఫిజికల్ డైరెక్టర్(పీడీ) గోపీనాథ్‌పై బాధిత విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదుచేసినట్లు టూటౌన్ ఇన్‌చార్జి సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... జెడ్పీహైస్కూల్ పీడీ గోపీనాథ్ కీచకపర్వంపై పత్రికల్లో వచ్చిన కథనాల మేరకు...ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో మహిళా ఎస్ఐ రమాదేవి పాఠశాలలోని విద్యార్థినులను విచారించారన్నారు. విచారణలో విద్యార్థినులు తెలిపిన వివరాల మేరకు పీడీపై విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపామన్నారు. అలాగే బాధిత విద్యార్థిని తల్లి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి గోపీనాథ్ లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు.

డిసెంబర్ 3 నుంచి రాష్ట్ర స్థాయి అగ్రిటెక్ సదస్సులు

కడప అగ్రికల్చర్ : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్తంగా డిసెంబర్ 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు గుంటూరు లాం ఫారంలో అధునిక వ్యవసాయ సాంకేతికతలపై రాష్ట్ర స్థాయి అగ్రిటెక్-2023 సదస్సు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞానకేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు.

ఏసీఏ అండర్-23 జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు షురూ


కేఓఆర్ఎం మైదానంలో తలపడుతున్న రెస్ట్ ఆఫ్ జోన్, నార్త్‌జోన్ జట్లు


120 పరుగులు చేసిన ఎం. వంశీకృష్ణ


5 వికెట్లు తీసిన ఆదిల్ హుస్సేన్

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్-23 మల్టీడేస్ అంతర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు శనివారం ప్రారంభమయ్యాయి. కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాలు వేదికగా పోటీలు ప్రారంభించారు. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో సెంట్రల్‌జోన్, సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెంట్రల్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 66.3 ఓవర్లలో 374 పరుగుల వద్ద సెంట్రల్‌జోన్ జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని ఎం. వంశీకృష్ణ 105 బంతుల్లో 6 సిక్సర్లు, 16 ఫోర్లతో 120 పరుగులు చేశాడు. ఈయనకు జతగా వసంతవర్ధన్ 69 పరుగులు, దుర్గా బాలాజీ 66 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్లు ఎస్. ఆదిల్ హుస్సేన్ 5 వికెట్లు, అఖిల్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 82 పరుగులు చేసింది. జట్టులోని టి.వంశీకృష్ణ 35 పరుగులు, యోగానంద 30 పరుగులతో క్రీజులో ఉన్నారు.

ఆధిక్యంలో నార్త్‌జోన్ జట్టు..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ జోన్, నార్త్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన రెస్ట్ జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 46 ఓవర్లలో 134 పరుగుల వద్ద రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని ఎం.కె. దత్తారెడ్డి 60 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్లు శ్రీకర్ సాయిరెడ్డి 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 30 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. జట్టులోని రవికిరణ్ 54 పరుగులతో క్రీజులో ఉన్నాడు. రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్లు ఎం. చెన్నారెడ్డి 3 వికెట్లు తీశాడు. కాగా తొలిరోజు మ్యాచ్ పూర్తయ్యే సమయానికి నార్త్‌జోన్ జట్టు 28 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

నవశకం

సొంత ఇల్లు నిర్మించుకుంటున్నా



మాది నిరుపేద కుటుంబం. 13 ఏళ్ల క్రితం భర్త మృతి చెందడంతో కూలీ నాలీ చేసుకుంటూ పూరి గుడిసెలో జీవనం సాగిస్తున్నా. గతంలో ఇంటి కోసం అర్జీలు పెట్టుకున్నా ఎవరూ కనికరించలేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ఇల్లు మంజూరు చేశారు. దీంతో ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటున్నా.

– శేషమ్మ, రెడ్డివారిపల్లె, మహల్‌రాజుపల్లె పంచాయతీ, కేవీపల్లె మండలం.

ఉపాధ్యాయులపై పెరిగిన గౌరవం



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి నాడు-నేడులో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఈ కారణంగా ఉపాధ్యాయులు అంటే విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు గౌరవ మర్యాదలు పెరుగుతున్నాయి. పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. జగనన్న ప్రభుత్వం రాక ముందు పేద మధ్య తరగతి వర్గాల వారు సైతం వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివించుకునేవారు. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక మంచి భోజనం, దుస్తులు, పుస్తకాలు, విశాలమైన గదులు, ఫర్నీచర్ అందుబాటులోకి వచ్చాయి.

– ఎస్.మజహరుల్‌హక్, స్కూల్ అసిస్టెంట్, నీలకంఠ్రావుపేట, రామాపురం మండలం

ఆరోగ్యశ్రీ కార్డు పొందాను



గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ కార్డు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాము. ఈ ప్రభుత్వంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కార్డు పొందాను. నేను గత కొద్ది కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాను. ఈ కార్డు ద్వారా నాకున్న వ్యాధికి చికిత్స పొందుతున్నాను.

– కెంచా నారాయణమ్మ, రామాపురం, రామాపురం మండలం

సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్


లంకమల అభయారణ్యంలో కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

సిద్దవటం : లంకమల అభయారణ్యంలోని సిద్దవటం-బద్వేల్ రేంజ్ సరిహద్దులోని సమస్యాత్మక ప్రదేశాల్లో శనివారం అటవీ అధికార సిబ్బందితో కూంబింగ్ నిర్వహించామని ట్రైనీ ఐఎఫ్ఎస్ శుభం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమాలకు పాల్పడకుండా తమిళ స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామన్నారు. అటవీ ప్రాంతాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే ప్రజలు వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సిద్దవటం-బద్వేల్ రేంజిల్లోని సరిహద్దుల్లో అణువణువు గాలించామన్నారు. ఎక్కడా కూడా స్మగ్లర్ల ఆనవాళ్లు కనిపించలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం రేంజర్ కళావతి, డీఆర్ఓ కె. ఓబులేసు, బద్వేల్ డీఆర్ఓ వెంకటశేషయ్య, రోళ్ల బోడు బీటు అధికారి విశ్వనాథ్, కొత్తచెరువు బీటు అధికారి రాజేష్‌రెడ్డి, బద్వేల్ బీటు అధికారి సువర్ణ కుమార్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

భారీగా తగ్గిన చికెన్ ధరలు

కిలోపై ఏకంగా రూ.80 తగ్గుదల

కార్తీక మాసానికి ముందు చికెన్ ధరలు ఇలా.. ఇప్పుడు ఇలా

లైవ్ కోడి	140	100
డ్రెస్డ్	220	140
స్కిన్‌లెస్	250	160
బోన్‌లెస్	400	280


చికెన్

రాజంపేట టౌన్ : గత కొంతకాలంగా పెరుగుతూ వచ్చిన చికెన్ ధరలు ప్రస్తుతం అమాంతంగా పడిపోయాయి. కిలో చికెన్ మీద ఏకంగా ఎనభై రూపాయలు తగ్గింది. నాలుగు రోజుల క్రితం వరకు కిలో చికెన్ (డ్రెస్డ్) 220 రూపాయలు ఉండగా ప్రస్తుతం 140 రూపాయలకు పడిపోయింది. పట్టణంలో దాదాపు యాభైకి పైగా చికెన్ విక్రయాల దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలన్నింటిలో సాధారణ రోజుల్లో రోజుకు మూడువేల కిలోల వరకు, ఆదివారం రోజు ఐదువేల కిలోలకు పైగా చికెన్ విక్రయాలు సాగుతుంటాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం కార్తీక మాసం కావడం, దీనికి తోడు అయ్యప్ప భక్తులు మాలలు వేయడంతో చికెన్ విక్రయాలు దారుణంగా పడిపోవడానికి ప్రధాన కారణమని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం రోజుకు వెయ్యి నుంచి పన్నెండు వందల కిలోలు మాత్రమే చికెన్ విక్రయాలు సాగుతున్నాయి. కార్తీక మాసం ప్రారంభం అయ్యాక ఈనెల 19న వచ్చిన ఆదివారం కేవలం రెండువేల ఐదువందల కిలోల లోపే విక్రయాలు సాగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం చికెన్ ధరలు బాగా తగ్గినప్పటికి కొనుగోలు మాత్రం పెరగకపోవడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం శీతాకాలం అయినందున తక్కువ రోజులకే కోడి ఉత్పత్తి అవుతుంది. ఒకవైపు కోళ్ల పరిశ్రమల్లో ఉత్పత్తి గణనీయంగా పెరగడం, మరోవైపు విక్రయాలు దారుణంగా పడిపోవడంతో వ్యాపారులతో పాటు కోళ్లపరిశ్రమ యాజమాన్యాలపై కూడా తీవ్ర ప్రభావం చూపనుంది.

చేతికందిన పంటను బూడిద చేశారు

- వేరు శనగపంటకు నిప్పు పెట్టిన ఆగంతకులు
- రూ.1.50లక్ష మేర పంటనష్టం
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన సీఐ


రైతు చినరెడ్డెప్ప నుంచి వివరాలు సేకరిస్తున్న రూరల్ సీఐ శివాంజనేయులు

నిమ్మనపల్లె : ఆరుగాలం కష్టించి పండించిన పంటను చూసి మురిసిపోయేలోపే.. అక్కసుతో కొందరు ఆగంతకులు కళ్లెదుటే బూడిద చేసిన ఘటన శనివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె పంచాయతీ బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన చిన్నప్ప కుమారుడు చిన్నరెడ్డెప్ప తమ పొలంలో వేరుశనగ పంటను సాగుచేశాడు. పంటను ఒబ్బిడిచేసి దాదాపు 50మూటల్లో నింపి పొలంలోనే ఉంచాడు. కాపలాగా రాత్రి అక్కడే పడుకుని, తెల్లవారుజామున 3.30 గంటలకు ఇంటికి వెళ్లాడు. పంటను ఇంటికి తెచ్చేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాడు. అంతలోనే...తెల్లవారి 5 గంటల సమయంలో పొలంలో పంట కాలిపోతోందని స్థానిక రైతు మల్లప్ప సమాచారం అందించాడు. దీంతో హుటాహుటిన చిన్నరెడ్డెప్ప అక్కడకు చేరుకోగా, అప్పటికే 50 మూటల్లోని వేరుశనగకాయలు కాలి బూడిదయ్యాయి. దీంతో జరిగిన ఘటనపై రైతు చిన్నరెడ్డెప్ప నిమ్మనపల్లె పోలీసులకు సమాచారం అందించి ఫిర్యాదు చేశాడు. అగ్నికి ఆహుతైన పంట రూ.1.50లక్షలు విలువ చేస్తుందని తెలిపాడు. అయితే మూడు నెలల క్రితం తిమ్మాపురానికి చెందిన కొందరు వ్యక్తులతో భూవివాదాలు ఉన్నాయని, శుక్రవారం మరోసారి అదే వివాదమై గొడవ జరిగిందన్నారు. తానంటే గిట్టనివారు ఉద్దేశపూర్వకంగా పంటను కాల్చి బూడిద చేసి ఉంటారని, విచారించి తనకు న్యాయం చేయాల్సిందిగా బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ శివాంజనేయులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, చిన్నరెడ్డెప్ప నుంచి వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు.

పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తే కఠిన చర్యలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న ఆటోలను తనిఖీ చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూలు పిల్లల్ని రవాణా చేసే ఆటోలలో పరిమితికి మించి రవాణా చేస్తున్నారని ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక తనిఖీ బృందాలతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో అధిక లోడుతో విద్యార్థులను రవాణా చేస్తున్న ఆరు ఆటో రిక్షాలను సీజ్ చేశామన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముగ్గురు సామర్థ్యం గల ఆటోలలో ఆరుగురు స్కూల్ విద్యార్థులు, నలుగురు సామర్థ్యం గల ఆటోలలో 8 మంది విద్యార్థులకు మాత్రమే అనుమతి ఉందన్నారు. అలాగే స్కూల్ బ్యాగులు క్యారియర్లు మొదలైనవి ఆటో రిక్షాకు బయటవైపు వేలాడదీయరాదన్నారు. వెనుక వైపు డోరు ఓపెన్ చేసి పిల్లల్ని కూర్చోనీయరాదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంబంధిత స్కూల్ యాజమాన్యాలు శ్రద్ధ వహించి పరిమితికి లోబడి మాత్రమే ఆటోలో విద్యార్థులను పంపించాలని సూచించారు. ఈ దాడుల్లో మోటార్ వాహనాల తనిఖీ అధికారులు వై .ప్రసాద్, శ్వేత, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

– వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న జనం


చోరీ జరిగిన ఆంజనేయస్వామి ఆలయం ఇదే

నందలూరు (రాజంపేట) : నందలూరులో గత రెండు నెలలుగా వరుస చోరీలతో స్థానిక ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇటీవలి కాలంలో ఒకేరోజు నాలుగు ఆలయాలలో చోరీ జరిగింది. మరలా రెండు రోజుల తరువాత మరో ఆలయంలో చోరీ జరిగింది. అది మరువకముందే ఓ కిరాణా దుకాణంలో, మరో మూడు రోజులకు ఓ రెండు కూల్ డ్రింక్స్ షాపులలో చోరీ జరిగింది. ఇంతలోనే శుక్రవారం రాత్రి నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ గొల్లపల్లికి వెళ్లే రహదారిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఆంజనేయస్వామి పంచలోహాల తొడుగు, సీసీ కెమెరాను దొంగలు ఎత్తుకెళ్లారు. దొంగలు ఖరీదైన వస్తువులను, నగదును దోచుకెళ్తున్నారు. కిరాణా షాపులలో ఖరీదైన సిగరెట్లు, నగదు తీసుకెళ్లారు. ఆలయాలలో ఖరీదైన వస్తువులు, హుండీలోని డబ్బులను దోచుకెళ్తున్నారు. చోరీల మీద చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాలుగా మారారు. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్ఐ అబ్దుల్ జహీర్ పరిశీలించారు. రాత్రి వేళల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

హోంనీడ్స్ దుకాణాల్లో ..

మదనపల్లె : పట్టణంలోని ఎంఎస్ఆర్ సర్కిల్ సమీపంలోని మూడు హోంనీడ్స్ దుకాణాల్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు పడి రూ.2.50లక్షల విలువచేసే వస్తువులను చోరీ చేశారు. దుకాణంలోని ఫర్నీచర్ వస్తువులతో పాటు దొరక్కుండా తప్పించుకునేందుకు సీసీ కెమెరా డీవీఆర్ అపహరించుకువెళ్లారు. శనివారం ఉదయం షాపులు తెరిచేందుకు వచ్చిన యజమానులు షట్టర్ తొలగించి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీం సంఘటనా స్థలానికి వచ్చి ఆధారాలు సేకరించారు. చోరీ ఘటనలో ఆసిఫ్ హోంనీడ్స్ దుకాణంలో రూ.1లక్ష, ముబారక్ హోంనీడ్స్ దుకాణంలో రూ.1లక్ష20వేలు, కమలా ట్రేడర్స్ అండ్ పెయింటింగ్ దుకాణంలో రూ.20వేలు నగదు, ఫర్నీచర్ నష్టం జరిగినట్లు దుకాణ యజమానులు పేర్కొన్నారు. ఆసిఫ్, ముబారక్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు చోరీ కేసు నమోదు చేయగా, కమలా ట్రేడర్స్ అండ్ పెయింటింగ్ యజమాని రాజేష్ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చిట్వేలిలో..

చిట్వేలి : మండల పరిధిలోని వెంకటరాజుపల్లి ఎస్సీ కాలనీలో చలమాల నారాయణమ్మ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపిన వివరాల మేరకు చలమాల నారాయణమ్మ శుక్రవారం ఊరిలో లేని సమయంలో గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలోని రూ. 80 వేలు విలువచేసే మూడు తులాల బంగార్నాని తీసుకెళ్లినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కడపలో చోరీలపై పోలీసుల నిఘా

– సీసీ ఫుటేజీల ద్వారా అనుమానితుడి ఫొటో విడుదల



కడప అర్బన్ : కడప నగరంలోని శంకరాపురం, ఓం శాంతినగర్, పక్కీరుపల్లి, కడపలోని పలు ప్రాంతాల్లో ఇళ్లల్లో జరిగిన దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు అనుమానితుడి చిత్రాన్ని విడుదల చేశారు. ఈ వ్యక్తి గురించిన వివరాలు తెలిసిన వారు 912100520, 9121100521, 921100522 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

యూపీఎస్సీలో ఆల్ ఇండియా 31వ ర్యాంకు


అనిల్‌కుమార్‌రెడ్డి

రామాపురం : ఇటీవల వెలువడిన యూపీఎస్సీ ఇంజినీరింగ్ సర్వీస్ పరీక్షా ఫలితాల్లో మేరువ అనిల్ కుమార్‌రెడ్డి ఆల్ ఇండియా 31వ ర్యాంకు సాధించాడు. మండలంలోని చిట్లూరు గ్రామం రాఘవరెడ్డిగారిపల్లెకు చెందిన అయోధ్యపురం వెంకటరామిరెడ్డి మనవడు మేరువ అనిల్‌కుమార్‌రెడ్డి వరంగల్ ఎన్ఐటీ కళాశాలలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఐఐఎస్సీ బెంగళూరు కళాశాలలో ఎంటెక్ పూర్తయింది. అనంతరం యూపీఎస్సీ నిర్వహించిన ఈఎస్ఈ 2023 పరీక్షల్లో ఆల్‌ఇండియా 31వ ర్యాంకు సాధించాడు. తండ్రి వెంకటరెడ్డి రిటైర్డ్ బ్యాంకు మేనేజర్, తల్లి నిర్మల గృహిణి, అన్న సునీల్‌కుమార్ రెడ్డి సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్టుమెంట్‌లో డిప్యూటి కమిషనర్‌గా బెంగళూరులో పని చేస్తున్నారు.

బాలికా విద్య అవసరాన్ని గుర్తించాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్, డీఆర్‌డీఏ పీడీలు శ్రీలక్ష్మి, ఆనంద్‌నాయక్, ఇతర అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తల్లిదండ్రులు బాలికా విద్య అవసరాన్ని గుర్తించి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్‌లు పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ స్పందన హాలులో డీఆర్‌డీఏ పీడీ అధ్యక్షతన జెండర్ ఆధారిత హింసపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం ద్వారా బాలికల బంగారు భవిష్యత్తుకు ఆటంకం కలిగించిన వారమవుతామన్నారు. తొలుత బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్ది వారిని ఎన్నుకున్న రంగంలో రాణించేందుకు ప్రోత్సహించాలన్నారు. భ్రూణహత్యల నివారణకు కృషి చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. ఈనెల 25 నుంచి డిసెంబరు 22 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన వారిచే ప్రతిజ్ఞ చేయించారు. సీఐ హసీం, చట్టాలగురించి వివరించారు. ఈ సందర్భంగా అతిథులు బాలికల సంరక్షణ, విద్యపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ సురేష్, భారతరత్న మహిళా మండలి అధ్యక్షురాలు పార్వతమ్మ, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు రహమతున్నీసా, ఏపీడీ ప్రసాద్‌తోపాటు ఏసీలు, ఏపీఎంలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నాం

పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు


ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డికి స్వీట్లు తినిపిస్తున్న బాబా ఫక్రుద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటారని వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. శనివారం ఉదయం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు గుర్తింపు హోదా ఇచ్చిన కారణంగా బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటారన్నారు. గుర్తింపు హోదాను కల్పించి గురుతర బాధ్యతను తమపై ఉంచినందుకు తమపై విశ్వాసాన్ని వమ్ము చేయకుండా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సంస్థ అభివృద్ధికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారక తిరుమలరావు, రవాణాశాఖ మంత్రి పినిపె విశ్వరూప్‌కు తమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.